నేడు వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తాండూరురూరల్, మే 14: వీరారెడ్డిపల్లి శ్రీవీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 4.21గంటలకు స్వామివారి పల్లకీసేవ, 6.05 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, ఉదయం 11.21గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సాయంత్రం 6.05 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



11వ వార్డు పరిధిలో పేరుకుపోయిన మురుగు

పారిశుధ్యం అస్తవ్యస్తం

- కాలువల్లో పేరుకుపోయిన చెత్త .. కంపుకొడుతున్న కాలనీ
- రోడ్లపై నడవలేని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

పరిగి, మే 14: పరిగి మున్సిపల్ పరిధి 11వ వార్డులో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. నెలరోజులుగా ఈవార్డు పరిధిలో పారిశుధ్య నివారణ పనులు చేపట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. మురికి కాలువల్లో చెత్తాచెదారం, మురుగుతో నిండిపోయి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. కాలువల్లో పేరుకుపోయి రోడ్లపై రావడంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల మధ్యలో ఎక్కడబడితే అక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు, పందులకు ఆవాసంగా మారిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిసరఫరా కూడా సరిగ్గా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నీటికోసం ఇటీవల మహిళలు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోతే తామెవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టి తాగు నీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



నా వార్డు పరిధిలోని నీటి సరఫరా సరిగ్గా లేదు. డ్రైనేజీల్లో చెత్తచెదారం నిండుతోంది. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. కాలువల్లో మురుగు నిండి రోడ్లపై వస్తోంది. పాదచారులు కూడా నడువలేని విధంగా తయారైంది. కనీసం చెత్తను తొలగించకపోవడంతో నానాఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

-ఎదిరె కృష్ణ, వార్డు కౌన్సిలర్, పరిగి

పురుషులదే ఆధిక్యం!



లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. పోలైన ఓట్ల లెక్కలు కూడా వచ్చాయి. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ రోజు ఉష్ణోగ్రతలు కాస్త శాంతించడంతో చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ఓటర్లు భారీగానే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లేశారు. చేవెళ్ల స్థానానికి 56.40శాతం ఓట్లు పోల్ కాగా, మల్కాజిగిరిలో 50.78శాతం పోలయ్యాయి.

ఓటు వినియోగంలో వెనుకబడిన మహిళలు

- చేవెళ్ల పార్లమెంట్‌లో 56.40% ఓటింగ్
- పురుషులు 56.72%
- స్త్రీలు 56.06 %
- మల్కాజిగిరి పార్లమెంటులో పోలింగ్ 50.78 %
- అత్యధికంగా మేడ్చల్‌లో 57.83 %
- అత్యల్పంగా ఎల్‌బీనగర్‌లో 46.27 %

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 56.40శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం పోలింగ్ పూర్తయినప్పటికీ పోలింగ్ లెక్కలు అర్థరాత్రి తరువాత తేల్చారు. అసెంబ్లీ వారీగా వివరాలను సేకరించి వీటన్నింటినీ క్రోడీకరించి మొత్తం పోలింగ్ లెక్కలు తేల్చారు. సోమవారం రాత్రి ప్రకటించిన వివరాలతో పోలిస్తే స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగింది. ఇదిలా ఉంటే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో సోమవారం జరిగిన ఎన్నికల్లో స్త్రీల కంటే పురుషులే అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈఎన్నికల్లో పురుషులు 56.72శాతం ఓటు హక్కు వినియోగించుకోగా స్త్రీలు 56.06శాతం ఓటేశారు. సాధారణంగా ఎన్నికల్లో మహిళ ఓటింగ్ శాతం అధికంగా ఉంటుంది. కానీ ఈసారి మహిళల ఓటింగ్ తగ్గడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పురుషులే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఒక్క శేరిలింగంపల్లిలో మినహా మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. తాండూరులో మహిళలు, పురుషుల ఓటింగ్ మధ్య ఎక్కువగా వ్యత్యాసం ఉంది. తాండూరులో మహిళల కంటే పురుషులు 3.26శాతం అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. అలాగే చేవెళ్లలో 3.12శాతం ,వికారాబాద్‌లో 2.8శాతం అధికంగా పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. శేరిలింగంపల్లిలో మాత్రం పురుషుల కంటే మహిళ ఓటింగ్ స్వల్పంగా ఎక్కువగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ తగ్గినప్పటికీ గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే కొంత మెరుగ్గానే ఉంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే రోజు సార్వత్రిక ఎన్నికలు జరగడంతో హైదరాబాద్, చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీగా ఉన్న ఆంధ్ర సెటిలర్స్ ఎన్నికల్లో ఓటేసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. దీంతో పోలింగ్‌పై ఎక్కువ ప్రభావమే పడింది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో లక్షలాది మంది సెటిలర్స్ ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వినియోగించుకున్నారు. అయితే ఇక్కడ ఉన్న ఓటర్లు కూడా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అనేకచర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఓటర్లలో చైతన్యం రావడం లేదు. ముఖ్యంగా చదువుకున్న వారు, ఉద్యోగస్తులు, యువతఅధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ దారుణంగా ఉంది. ఇదిలా ఉంటే చేవేళ్ల అసెంబ్లీ పరిధిలో అత్యధికంగా 71.83శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తరువాత వికారాబాద్‌లో 70.44శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా శేరిలింగంపల్లిలో 43.91 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో

మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం	ఓట్ల శాతం
మేడ్చల్	57.83 %
మల్కాజిగిరి	51.97 %
కుత్బుల్లాపూర్	50.19 %
కూకట్‌పల్లి	48.48 %
ఉప్పల్	48.45 %
ఎల్‌బీనగర్	46.27 %
కంటోన్మెంట్	51.61 %

మేడ్చల్ మే14(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సోమవారం జరిగిన మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల్లో 50.78 ఓటింగ్ శాతం నమోదైంది. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో అత్యధికంగా మేడ్చల్ నియోజకవర్గంలో 57.83 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 46.27 శాతం నమోదైంది. అదేవిధంగా మల్కాజిగిరిలో 51.97 శాతం, కుత్బుల్లాపూర్‌లో 50.19 శాతం, కూకట్‌పల్లిలో 48.48 శాతం పోలింగ్ జరిగింది. ఉప్పల్ నియోజకవర్గంలో 48.45, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 51.61 శాతం పోలింగ్ నమోదైంది. గత పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం కాస్త తగ్గింది. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 53.4 శాతం నమోదు కాగా 2024లో జరిగిన ఎన్నికల్లో 50.78 శాతం నమోదైంది.

చేవెళ్ల పార్లమెంట్		మొత్తం ఓటర్లు				పోలైన ఓట్లు				
నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	శాతం
మహేశ్వరం	537	2,85,137	2,71,538	66	5,56,741	1,50,807	1,42,656	9	2,93,472	52.71
రాజేంద్రనగర్	543	3,16,979	2,95,153	38	6,12,170	1,73,356	1,57,959	3	3,31,318	54.12
శేరిలింగంపల్లి	633	4,00,361	3,57,600	141	7,58,102	1,75,609	1,57,226	18	3,32,853	43.91
చేవెళ్ల	298	1,35,429	1,34,526	5	2,69,960	99,389	94,521	1	1,93,911	71.83
పరిగి	305	1,33,568	1,32,989	9	2,66,566	90,155	88,480	2	1,78,637	67.01
వికారాబాద్	284	1,14,965	1,16,660	14	2,31,639	82,604	80,556	7	1,63,167	70.44
తాండూరు	277	1,17,821	1,25,364	7	2,43,192	81,317	82,429	3	1,63,749	67.33
మొత్తం	2,877	15,04,260	14,33,830	280	29,38,370	8,53,237	8,03,827	43	16,57,107	56.40



కుటుంబ సభ్యులతో కలసి దుర్గం చెరువు వద్ద ఆహ్లాదంగా గడుపుతున్న చేవెళ్ల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి




ఫలక్‌నుమా ప్యాలెస్‌లో కుటుంబ సభ్యులతో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

టెన్షన్ వీడి..

నిన్నటి దాకా ఉరుకులు.. పరుగులు. ఎలాగైనా ఎన్నికల్లో విజయం సాధించాలన్న ఆలోచన తప్ప మరొకదానిని గురించి ఆలోచించే పరిస్థితి కూడా లేదు. ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు ఆలోచనల్లోనే మునిగి తేలారు. ఇందుకోసం కాలికి బలపం కట్టుకొని సుడిగాలిలా నియోజకవర్గమంతా తిరిగారు. ప్రచారాన్ని హోరెత్తించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు నిద్రాహారాలకు దూరమయ్యారు. ఎట్టకేలకు ఎన్నికలు పూర్తయ్యాయి. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం ఎన్నికలు పూర్తి కావడంతో వారు మంగళవారం వారి వారి కుటుంబాలతో ఆనందంగా గడిపారు.

చేవెళ్ల బాద్‌షా ఎవరో?



- పోలైన ఓట్లు. అనుకూల ప్రతికూల ఓట్లపైనా ఆరా
- కూడికలు, తీసివేతలతో ఎవరికి వారే గెలుపు ధీమా





వికారాబాద్/పరిగి, మే 14 : ఓట్ల పండగ ముగిసింది. ఇక ప్రజా తీర్పు మిగిలింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుండటంతో అందరు పోలింగ్ సరళిపైనే చర్చించుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్లు అనుకూల ప్రతికూల ఓట్లపైన ఆరా తీస్తున్నారు. కూడికలు, తీసివేతలతో ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేసున్నారు. గెలుపు గుర్రాలపై స్వారీ చేసిన అభ్యర్థులు విజేత ఎవరనే దానిపై ఆసక్తితో అంచనాలు వేస్తున్నారు. ఓటర్లు తమ తీర్పును ఓట్ల రూపంలో ఎలక్ట్రానిక్ యంత్రాలలో నిక్షిప్తం చేయగా, అభ్యర్థులు కార్యకర్తలు గెలుపుపై టెన్షన్ పడుతున్నారు. రాష్ట్రంలోనే చేవెళ్ల ఎంపీ స్థానం గెలుపు ఎవరిదనేదానిపై హాట్‌టాపిక్‌గా చర్చ జరుగుతున్నది. చేవెళ్లలోక్ సభ బరిలో 43 మంది, మల్కాజ్‌గిరి పరిధిలో 22 మంది అభ్యర్థుల బరిలో ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్యనే పోటీ జరిగింది. అయితే విజయం మాత్రం బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యనే ఉంది. పలాన గ్రామంలో మా పార్టీకి అధికంగా ఓట్లు పడ్డాయంటే మా పార్టీకి పడ్డాయంటూ కార్యకర్తలు, నాయకులు చర్చించుకుంటున్నారు. అభ్యర్థుల విజయావకాశాలు ఎవ్వరికి ఎక్కువగా ఉన్నాయో అంచనాలు వేస్తున్నారు.

ప్రజల్లో జోరుగా చర్చలు

గ్రామాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడనే దానిపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మొన్నటి వరకు ఎంతో సందడితో ఉన్న నాయకులు ఇప్పుడు పార్టీ

మిగతా 6వ పేజీలో...

భద్రత స్ట్రాంగ్!

- బీఎస్ ఐటీ, హోళీ మేరీ కాలేజీ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, వెస్లీ కాలేజీ వద్ద సాయుధ బలగాల పహారా
- అనుక్షణం సీసీ కెమెరాల ద్వారా నిఘా
- 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు
- 14 అసెంబ్లీ నియోజవర్గాల నుంచి స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు
- పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములకు సీల్



స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి గౌతమ్



స్ట్రాంగ్ రూములో ఈవీఎంలను పరిశీస్తున్న కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్/మేడ్చల్/వికారాబాద్, మే 14 : చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన విషయం తెలిసిందే.. ఇక ఓట్ల లెక్కింపు మిగిలింది. గతంతో పోల్చితే ఈ సారి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతగా జరగటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. ఓటింగ్ అనంతరం ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఓట్ల లెక్కింపు కేంద్రమైన చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుంచి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరి చూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని స్ట్రాంగ్ రూంలలో నియోజకవర్గాల వారీగా క్రమపద్ధతిలో అమర్చారు. ఈసందర్భంగా మంగళవారం ఉదయం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియాతో పాటు, అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకుసీల్ వేశారు. చేవెళ్ల పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ సేహ్నాలు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాంటి గందరగోళం, లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

కౌంటింగ్ కేంద్రం నిషేధాజ్ఞలు

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ శశాంక ప్రతి కౌంటింగ్‌హాల్, స్ట్రాంగ్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4 చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.

డాక్యుమెంట్స్ పరిశీలన

మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఫామ్ 17ఎ , ఎలక్షన్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను మంగళవారం పార్లమెంటు నియోజకవర్గ జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా, జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, పోటీలో ఉన్న అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో స్ర్కూటినీ చేయడంజరిగిందనిగౌతమ్ తెలిపారు.

మూడంచెల భద్రత

చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కాలేజీలో భద్రపర్చిన ఈవీఎంలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌కి ఒక ప్రవేశ ద్వారం ఉండేలా జాగ్రలు తీసుకున్నారు. గదికి డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్ 24 గంటలూ సాయుధ రక్షలో ఉంటుంది. స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచల భద్రతలో, మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలాగాలను మోహరించారు. దీని కోసం ఒక విభాగం 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా ఒక ప్లాటూన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర సాయుధ పోలలీసులు ద్వితీయ శ్రేణిలో, సాధారణ పోలీసు సాయుధ బలగాలు మూడోవ శ్రేణిలో మోహరించారు. స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చిన సీసీ కెమెరాలు ఐసీసీసీ కమాడ్ అండ్ కంట్రోల్ సెంటర్(సీసీపసీ) కనెక్ట్ చేశారు. 24 మంది సీఆర్‌పీఎఫ్ సాయుధ బలగాలు, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్(టీఎస్ఎస్‌పీ)లు 24 మంది, 20 మంది సివిల్ పోలీసులు, ఒక ఏసీపీ, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు పహార కాస్తున్నారు. వీరితో పాటు 20 మంది అగ్నిమాపక పోలీసులు ఉన్నారు. ఇందులో ఒక సీఐతో పాటు ఎస్సై బందోబస్తులో ఉన్నారు. మొత్తం 90 మంది వరకు స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్నారు.

స్ట్రాంగ్ రూములకు సీల్..

మల్కాజిగిరి పార్లమెంటుకు పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలను కీసర, భోగారంలోని హోళీ మేరీ కాలేజీ, సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం, వెస్లీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంకశుక్లా, జిల్లా రిటర్నింగ్ అధికారిగౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి సీల్ వేసినట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ హోళీ మేరీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుచడం జరిగిందన్నారు. అలాగే ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు సరూర్‌నగర్ స్టేడియం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను వెస్లీ కళాశాలలో భద్రపరిచినట్లు తెలిపారు.

చేవెళ్ల బాద్‌షా ఎవరో?

(5వ పేజీ తరువాయి) కార్యాలయాలను కూడా తెరువడంలేదు. ఎన్నికలు ముగిసినప్పటికీ ఓట్ల లెక్కింపు జూన్ నాలుగు వరకు అంటే ఇరవై రోజులకు పైగా గడువు పెట్టడంతో రాజకీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫలితం కోసం జూన్ 4 వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండడంతో రాజకీయ పార్టీల కార్యకర్తల్లో కాక అన్ని వర్గాల ప్రజల్లో ఫలితాలపై ఆసక్తి నెలకొని ఉన్నది. దీంతో ఎవరు గెలుస్తారనే దానిపై అన్ని వర్గాల ప్రజల్లో జోరుగా చర్చలు జరుపుతున్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తప్పక గెలిచితీరుతాడని ఆయన వర్గీయులు గంటాపథంగా చెబుతున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కూడా భారీ మెజార్టీతో గెలుస్తారని ఆ పార్టీ వర్గీయులు ధీమాతో ఉన్నారు. ఈ ఇద్దరిని కాదని తన విజయమే ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ వర్గీయులు ధీమాతో ఉన్నా, రెండు రోజుల ముందు నుంచే గులాబీ క్యాడర్‌కు గట్టిపని చేయాలని సంకేతాలు లేకపోవడంతో డీలాపడిపోయారు.

ఎవరికి వారే..

ఎన్నికల పోలింగ్ సరళిని గమనించిన ముగ్గురు అభ్యర్థులకు చెందిన కార్యకర్తలు నేతలు పోలింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందంటే తమకు అనుకూంగా ఉందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు మాత్రం తమ తీర్పును ఓట్ల రూపంలో ఎలక్ట్రాన్ యంత్రాలలో భద్రపరిచారు. ఎన్నికల ఫలితాలు వెలువడడానికి ఇంకా కొద్ది రోజుల సమయం ఉండడంతో నిన్నటి వరకు ఉన్న రాజకీయ వేడి సారి చల్లారిందని చెప్పవచ్చు. ఎన్నికల ఫలితాలు వెలువడడానికి ఎక్కువ సమయం ఉండడంతో కార్యకర్తలు, నేతల్లో ఒక విధమైన టెన్షన్ నెలకొని ఉంది. ఫలితాలు వెలువడడానికి ఉన్న గడవు ఎక్కువ రోజులు ఉంటంతో ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో, హోటల్స్ పాన్ షాప్‌ల్లో, దుకాణాల్లో ఎటూ చూసిన పోలింగ్ సరళిపై ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై చర్చలు సాగుతున్నాయి. ఎన్నికల ఫలితాలపై ప్రజలు, రాజకీయనేతల పరిస్థితి ఈ విధంగా ఉంటే అభ్యర్థుల సైతం విజయం తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీగా ఎవరు గెలుస్తారో!

- ఫలితాలపై సర్వత్రా చర్చ..
- పెత్తనం కోసం పాకులాటలు
- వికారాబాద్ సెగ్మెంట్‌లో పైచేయి ఎవరిదో!

వికారాబాద్, మే 13: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా ఫలితాలపైన చర్చ. ఎవరు గెలుస్తారు? ఎంత మెజారిటీ వస్తుంది.. ఏ నియోకవర్గంలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. చేవెళ్ల పార్లమెంట్ స్థానం విషయానికి వస్తే అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి ఒకలా ఉంటే.. వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిస్థితి మరోలా ఉంటుంది. దానికి కారణం కూడా లేకపోలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన రంజిత్‌రెడ్డి.. ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావడం. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఓడించేందుకు రంజిత్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు. కాగా, రంజిత్ రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత ఆయన కాంగ్రెస్‌లో చేరడంతో ఆ వర్గాన్ని పార్టీలోకి తీసుకొచ్చే క్రమంలో నానా ఇబ్బందులు పడ్డారు. అయితే, బీజేపీ నాలుగు నెలల ముందు నుంచే ప్రచారం ప్రారంభించింది.

కాంగ్రెస్, బీజేపీ బలాబలాలు

కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో క్యాడర్ ఉండడం, ప్రతీ మండలంలో బలమైన నాయకులు ఉండడం కలిసి వచ్చే అంశాలుగా మారాయి. ఈ క్రమంలో బీజేపీకి సంబంధించి మోదీ వేవ్, విశ్వేశ్వర్‌రెడ్డి తప్ప.. బూత్‌స్థాయిలో బలమైన నాయకుడు లేని పరిస్థితి. వికారాబాద్‌లో గతంలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రయత్నించిన రంజిత్‌రెడ్డికి.. తాము ఎలా పనిచేస్తామని మొదట్లో కాంగ్రెస్ నాయకులు ప్రతీ విషయంలో అడ్డుపడ్డారు. దాంతో కాంగ్రెస్ అంత త్వరగా ప్రజల్లోకి వెళ్లలేకపోయింది. ముందుగా రేవంత్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటారని అందరూ అనుకున్నారు. చివరి నిమిషంలో వేంనరేందర్‌కు అప్పగించడంతో అంత ప్రభావం చూపలేకపోయారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఫలితాలపైనే సర్వత్రా ఆసక్తి

వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏ మండలం నుంచి ఎన్ని ఓట్లు పడ్డాయి? ఏ వర్గం ఓట్లు ఎవరికి పడి ఉండొచ్చు అనే చర్చ జోరుగా సాగుతోంది. పట్టణంలో బీజేపీకి లీడ్ వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా.. పట్టణవాసులు ఎప్పుడూ కాంగ్రెస్‌కే లీడ్ ఇస్తారని, ఈసారి కూడా రిపీట్ అవుతుందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇక పలు మండలాల్లో బీజేపీకి పెద్దగా క్యాడర్ లేకపోవడం కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వం ఉండడం ప్లస్ పాయింట్. సైలెంట్ ఓటింగ్ ఎటువైపు ఉందో తెలియని పరిస్థితి. నియోజకవర్గంలో కొంతవరకు కాంగ్రెస్ లీడ్ ఇచ్చినా.. మిగతా చోట్ల బీజేపీకి అవకాశాలుంటాయని విశ్లేశకులు పేర్కొంటున్నారు.

రద్దీలేని వేళల్లో రాయితీ ఎందుకు?

- కాంటాక్ట్ లెస్ కార్డ్సపై ప్రయాణికుల పెదవి విరుపు
- నాన్ పీక్ అవర్స్‌లో ఆఫర్‌ను అమలు చేయడంపై విమర్శలు
- 10 శాతం మంది కూడా వినియోగించుకోని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరు కోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ.. అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్‌అండ్ టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై విమర్శిస్తున్నారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎప్పుడు చూసినా రద్దీ కనిపిస్తోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు 3 నిమిషాలకోసారి రైళ్లను నడిపిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్నీ ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్ అండ్ టీ.. ఉన్న వాటిని కూడా పూర్తి స్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డ్స

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌కార్డు, సూపర్ సేవర్ ఆఫర్(ఎస్ఎస్ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్స్(సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు(నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10 శాతం రాయితీ అందిస్తున్నారు. సదరు ఆఫర్‌ను కేవలం 10 శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. 90 శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పీక్ అవర్స్(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీ లేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికీ ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10 శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలామంది వినియోగించుకుంటారని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో మే ఒకటో తేదీ నుంచి ఆయా ఆఫర్లను కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- వేసవి తాపంతో ఈతకు వెళుతున్న చిన్నారులు
- ఎండవేడిమి నుంచి ఉపశమనం



మాడ్గుల, మే 14 : వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఈతతో సేదతీరుతున్నారు. దాంతో ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు. మండలంలోని నల్లచెర్వు గ్రామంలోని చింతల బాయిలో చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతలు కొడుతూ కనిపించారు. కొందరు విద్యార్థులకు యువకులు ఈత నేర్పించడంతో పాటు ఏవైనా అనుకోని ప్రమాదాలు చోటు చేసుకోకుండా దగ్గరుండి చూసుకుంటున్నారు. కాగా, బోరుబావులు ఎక్కువవ్వడంతో మండలంలో దాదాపు 33 గ్రామ పంచాయతీలకు నాలుగైదు బావులు మాత్రమే ఉన్నాయి.

మోదుగాకు విస్తర్లు కనుమరుగు




మోదుగాకు విస్తరు తయారు చేస్తున్న ఓ గృహిణి

బషీరాబాద్, మే 14: మారిన జీవన విధానంలో అప్పటి రోజుల్లో ఎక్కువగా వినియోగించిన మోదుగ విస్తర్లు పూర్తిగా కనుమరగవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోకి వెళితే ఎక్కడ చూసినా వేసవికాలంలో సహజసిద్ధంగా దొరికే మోదుగ ఆకులను సేకరించి ఇంటింటా మహిళలు విస్తర్లు తయారు చేస్తూ కనిపించేవారు. ప్రస్తుతం పల్లె ప్రాతంలో ఇలాంటి దృశ్యాలు ఎక్కడా కూడా కనిపించడం లేదు. బషీరాబాద్ మండలంలోని పర్వత్‌పల్లి గ్రామానికి చెందిన అల్లాపూరం అమృతమ్మ మోదుగ విస్తర్లు తయారు చేస్తూ కనిపించగా 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. మోదుగ ఆకులతో విస్తర్లు తయారు చేసి ఇంట్లో నిల్వ చేసుకుని ఏడాది మొత్తంగా దైవపూజకు వినియోగిస్తానని అలా చేయడమే ఎంతో శ్రేష్ఠమని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా ఆయుర్వేదం ప్రకారం ఆకు పచ్చని ఆకులో భోజనం చేయడం వల్ల కళ్లు, మనసుకు ఇంపును ఇవ్వడంతో పాటు జీర్ణశక్తి పెరుగుతుందని మన పూర్వీకుల నమ్మకం. మరి కొందరు నిరుపేద మహిళలు మోదుగ విస్తర్లతో అప్పట్లో ఉపాధి కూడా పొందేవారు. ఇదిలా ఉండగా ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనం చేస్తే అందులోని రసాయనాలు కరిగి పాలిథిన్ పదార్థం మనిషి శరీరంలోకి చేరి రకరకాల రోగాలకు దారి తీస్తుందని నిపుణులు చెబుతుంటారు. ఏది ఏమైనా యాంత్రిక జీవనంలోకి రెడీ మేడ్ రంగురంగులతో తయారు చేసిన ప్లాస్టిక్ విస్తర్లు, డిస్పోజబుల్స్ గ్లాసులు రావడంతో పర్యావరణానికి పెనుముప్పుగా మారింది.

మైసమ్మ ఆలయంలో
అపురూప దృశ్యం

- దేవత విగ్రహంపై ప్రసరించిన సూర్యకిరణాలు



కడ్తాల్, మే 14 : ఆపద మొక్కుల దైవంగా ప్రసిద్ధి గాంచిన రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో మైసమ్మ దేవత విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకిన అపురూప దృశ్యం మంగళవారం ఆవిష్కృతమైంది. మధ్యాహ్నం 12నుంచి 12.15గంటల వరకు సూర్యుడి కిరణాలు అమ్మవారి విగ్రహంపై పడ్డాయి. ఎన్నడూ లేని విధంగా విమాన గోపురం మీదుగా సూర్య కిరణాలు గర్భగుడిలోని మైసమ్మ విగ్రహ నుదుటిపై ప్రసరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇది అమ్మవారి మహత్యమే అని భక్తులు దేవతను దర్శించుకొని పూజలు చేశారు.

పశుగ్రాసానికి 'ట్యాంకర్ నీరు'



పశుగ్రాసానికి ట్యాంకర్ నీరుపెట్టి కాపాడుకుంటున్న రైతు సోమయ్య

యాచారం, మే 14 : వరి పంటతో పాటు కూరగాయ తోటలకు సరిపడా నీరందక రైతన్నలు ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఓ రైతు పశువుల కొరకు వేసిన గ్రాసానికి ట్యాంకర్ నీరు పెట్టి కాపాడుకుంటున్నాడు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తికి చెందిన గౌర సోమయ్యకు మూడెకరాల భూమి ఉంది. రెండు నెలల క్రితం బోరు ఎండిపోయింది. దాంతో పశువులకు మేత లేకుండా పోయింది. ఎకరం భూమిలో లూజర్న్ అనే పశుగ్రాసం పెంచుతున్నాడు. బోరు ఎండిపోవడంతో గడ్డి చేతికొచ్చే పరిస్థితి లేదని గ్రహించి మూడు పాడి పశువులకు మేత లేక పాలు ఇవ్వలేవని గ్రహించాడు. దాంతో వాటర్ ట్యాంకర్‌కు రూ.800 చొప్పున ఖర్చు పెట్టి గ్రాసాన్ని కాపాడుతున్నాడు. ఇప్పటికే 6 ట్యాంకర్ల నీరు పెట్టానని రైతు చెప్పాడు. తెలిసిన రైతు వద్ద రూ.25 వేలు ఖర్చు చేసి వరి గడ్డి కొన్నట్లు తెలిపాడు.

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు

● అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమక్షంలో పాలమూరు యూనివర్సిటీకి తరలింపు



పాలమూరు యూనివర్సిటీలో ఈవీఎంలను భద్రపర్చిన గది వద్ద అధికారులు

కొడంగల్, మే 14 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీకి తరలించారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య యంత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్‌లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్‌లలోని స్లిప్పులు, మాక్ పోల్ ధ్రువపత్రాలు, పీవో డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్ తదితర ఎన్నికల సామగ్రిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చి తాళాలు వేసి సీల్ వేసినట్లు ఆయన తెలిపారు. వారితో పాటు కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఈవీఎంలలో ఎంపీ అభ్యర్థుల భవితవ్యం

● కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 71.04 శాతం పోలింగ్
● ఫలితాలపై ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ
● కాంగ్రెస్‌దే పైచేయి.. కనిపించని బీఆర్ఎస్ హవా!

కొడంగల్, మే 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోటాపోటీ ప్రచారాల జోరు, విమర్శల తుఫాను, ఆరోపణల ఉరుములు, ప్రలోభాల మెరుపుల తర్వాత ఎట్టకేలకు ఎన్నికల యుద్ధం సోమవారం పోలింగ్‌తో ముగిసింది. ఉదయం నిదానంగా ప్రారంభమైన ఓటింగ్ సరళి క్రమక్రమంగా పుంజుకుంది. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో రెండు వేలకు పైగా కొత్త ఓటర్ల పేర్లు నమోదయ్యాయి. వారందరూ ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాల దగ్గరికి చేరుకొని ఓటుహక్కు వినియోగించుకోవడం విశేషం. దాంతో కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 71.04 శాతం పోలింగ్ నమోదైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించిన కాంగ్రెస్ పార్టీ హోరాహోరీ ప్రచారం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో మహబూబ్‌నగర్‌లో ఎలాగైనా గెలుపొందాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. బీజేపీ నుంచి ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీఆర్ఎస్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో నిలిచారు. అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించి ప్రచారం నిర్వహించినప్పటికీ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోరు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేలా కొనసాగింది. కొడంగల్, నారాయణపేట, మక్తల్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ కాస్త నెమ్మదిగా కొనసాగింది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 45.84 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత 58.92, సాయంత్రం 5 గంటలకు 68.40 శాతం పోలింగ్ నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

‘పట్నం’ సెగ్మెంట్‌లో తగ్గిన ఓటింగ్ శాతం

● అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభకు 7.99 శాతం తక్కువ

ఇబ్రహీంపట్నం, మే 14: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంటులో గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో 74.82 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఐదు నెలల తర్వాత వచ్చిన ఎంపీ ఎన్నికల్లో 66.83 శాతం మాత్రమే పోలైంది. అంటే 7.99 శాతం ఓటింగ్ తగ్గింది. ఎన్నికల అధికారులు పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినప్పటికీ వృద్ధులు ఆశించిన మేర ఓటింగ్‌లో పాల్గొనలేదని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉపాధికోసం దూర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లను గుర్తించి రవాణా చార్జీలు ఇచ్చి మరీ రప్పించేందుకు ప్రయత్నాలు చేసేవారు. కానీ, ఈసారి అంతగా పట్టించుకోలేదు. ఎండల తీవ్రత దృష్ట్యా కొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండడం కూడా ఓటింగ్ శాతం తగ్గడానికి కారణమని చెప్పవచ్చు.

ముగిసిన పోరు.. మొదలైన ఉత్కంఠ

● నాగర్‌కర్నూల్ ఫలితంపై జోరుగా చర్చ
● కల్వకుర్తిలో 72.51 శాతం పోలింగ్



డాక్టర్ మల్లు రవి (కాంగ్రెస్)



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్(బీఆర్ఎస్)



పోతుగంటి భరత్ ప్రసాద్(బీజేపీ)

ఆమనగల్లు, మే 14 : లోక్‌సభ ఎన్నికల పోరు ముగియడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. హోరాహోరీగా సాగిన సార్వత్రిక సమరంలో ఓటర్లు ఎవరిని ఆదరించారోనని, ఏ పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఉంటాయోనన్న చర్చకు మళ్లీ తెరతీసింది. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటే.. కాదు తమ పార్టీ అభ్యర్థే గెలుస్తాడంటూ ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానానికి 19 మంది అభ్యర్థులు పోటీ చేసినా ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ల మధ్యే పోటీ కొనసాగింది. కల్వకుర్తి, ఆమనగల్లు, చారగొండ, వెల్దండ, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలతో కూడిన కల్వకుర్తి నియోజకవర్గంలో 2,44,405 ఓట్లకు గాను 1,77,224 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో 72.51 శాతం ఓట్లు పోలయ్యాయి. కల్వకుర్తి నియోజకవర్గంలో ఈసారి లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగింది. విలక్షణమైన తీర్పులిచ్చే నియోజకవర్గ ఓటర్లు ఎవరిని ఆదరించారోనని, తీర్పు ఎలా ఉంటుందోనని అభ్యర్థులు, అనుచరులను టెన్షన్‌కు గురి చేస్తోంది. ఫలితంపై ఒకవైపు ఆందోళన చెందుతూనే.. మరోవైపు ఎవరికి వారు విజయంపై బయటకు ధీమా కనబరుస్తున్నారు. ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఫలితాలపైనే చర్చ సాగుతోంది. పోలింగ్ ముగియడంతో గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారిగా పోలైన ఓట్లు, తమకు లభించే ఓట్లపై ప్రధాన పార్టీల నాయకులు అంచనాల లెక్కలతో కుస్తీ పడుతున్నారు. తమ పోలింగ్ బూత్ ఏజెంట్లు, స్థానిక పార్టీ శ్రేణులతో తమకు స్థానికంగా పడిన ఓట్లపై అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. కాగా, ఫలితం అనేది ఈవీఎం బాక్స్‌లలో నిక్షిప్తమై ఉంది. జూన్ 4న ఉత్కంఠకు తెరపడనుంది.

భక్తుల ఇలవేల్పు.. ఫాతిమా మాత

● నేడు ఫాతిమాపూర్‌లోని చర్చిలో దర్శన వార్షిక మహోత్సవం
● స్థానికులతో పాటు ఇతర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తజనం
● ఏర్పాట్లు పూర్తిచేసిన చర్చి కమిటీ



విద్యుద్దీపాలంకరణలో చర్చి



ఫాతిమా మాత విగ్రహం

కొత్తూర్, మే 14: కొత్తూర్ మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్‌లో వెలసిన ఫాతిమా మాత చర్చి భక్తులకు ఇలవేల్పుగా నిలుస్తోంది. చర్చిని దర్శించుకుని ప్రార్థనలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈనెల 13న జరగాల్సిన ఉత్సవాలను చర్చి కమిటీ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 15వ తేదీకి మార్చింది. దాదాపు 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ఫాతిమా మాత చర్చికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఫాతిమా మాత ఓ భక్తుడికి ప్రత్యక్షం కావడంతో అతడు ఇక్కడ ఓ బండరాయిపై చిన్న గుడిసె వేసి ఫాతిమా మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు పూర్వీకులు తెలిపినట్లు ఆధారం. నాటి నుంచి ఫాతిమా మాత చర్చిగా వాడుకలోకి వచ్చింది. కొన్ని సంవత్సరాల తర్వాత దాతలు ముందుకు వచ్చి భారీ చర్చిని నిర్మించారు. ప్రతీ సంవత్సరం మే 13, అక్టోబరు 13వ తేదీల్లో రెండు సార్లు వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈమేరకు చర్చి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ ఆర్చిబిషప్ పూల ఆంటోనీ, నల్గొండ బిషప్ కరనమ్ దమన్‌కుమార్‌లు హాజరవుతున్నట్లు చర్చి ఫాదర్, విచారణ గురువు లూర్దుమారెడ్డిలు మంగళవారం తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని నేడు(బుధవారం) తెల్లవారుజామునుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అలాగే మధ్యాహ్నం ఫాతిమా మాత స్వరూపంతో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవాలకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా భోజనం, తాగునీటి వసతి కల్పించేందుకు చర్చి కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాలను పురస్కరించుకుని చర్చిని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

వాడిపోతున్న వన నర్సరీ

● నీరులేక ఎండుముఖం పట్టిన వేల మొక్కలు
● నీరుగారుతున్న ‘హరితహారం’ లక్ష్యం
● అధికారుల నిర్లక్ష్యం.. పట్టించుకోని ప్రభుత్వం

చౌదరిగూడ, మే 14 : వాతావరణ సమతుల్యతను కాపాడడానికి గ్రామానికొక నర్సరీతోపాటు ఆటవీ ప్రాంతాలు దగ్గర ఉన్నచోట ప్రభుత్వం వన నర్సరీలు ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలోని వన నర్సరీలో నిర్వహణ లోపం కారణంగా వేల మొక్కలు ఎండిపోయాయి. తీరొక్క మొక్కలను పెంచాల్సిన నర్సరీలో ఏ ఒక్క మొక్కనూ కాపాడలేని దుస్థితి నెలకొంది. అటవీశాఖ అధికారులకు మొక్కల సంరక్షణపై ఎంత బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో మొక్కకు జీపీఎస్ ట్యాగింగ్ చేసి సంరక్షించాలంటూ కలెక్టర్లు ఆదేశాలు జారీ చేసినా.. నర్సరీ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ దుస్థితికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.



పెద్ద ఎల్కిచర్ల శివారులోని వన నర్సరీలో ఎండిన మొక్కలు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

● దోమ మండలం మోత్కూర్‌లో ఖాళీ బిందెలతో మహిళల నిరసన



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

దోమ, మే 14: తాగునీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని మోత్కూర్ గ్రామం గాలి పోశవ్వ కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కాలనీకి వారం రోజుల నుంచి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నిరసనలో కాలనీవాసులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో నీటితొట్టెలు

● పట్టించుకోని అధికారులు



తిర్మలాపూర్‌లో శిథిలావస్థకు చేరుకున్న నీటి తొట్టె

పూడూరు, మే 14: గతంలో పశువుల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించి గ్రామాల్లో నీటితొట్టెలను నిర్మించింది. మూగజీవుల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన నీటితొట్టెలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో వాటి పరిస్థితి పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో మండుటెండల్లో జీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. పశువులు, పక్షులు నీటితొట్టెలు లేక విలవిల్లాడుతున్నాయి. తిర్మలాపూర్ గ్రామంలో నీటి తొట్టెలు పూర్తిగా నాశనం కావడంతో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పశువుల కాపరులు వాపోతున్నారు.

గానుగ యంత్రాలతో స్వయం ఉపాధి

● తెల్ల కుసుమలు, పొద్దుతిరుగుడు, పల్లీల నుంచి నూనె తీయడంతో చేతినిండా పని
● గానుగ యంత్రాల ద్వారా తీసిన నూనెలపై ఆసక్తి చూపుతున్న ప్రజలు



యంత్రంలో పోసిన అనంతరం ప్రాసెస్ జరిగి బయటకు వస్తున్న కుసుమ నూనె



ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న గానుగ యంత్రం

బషీరాబాద్, మే 14 : వంటనూనె ఉపయోగించకుంటే ఏ ఇంట్లోనూ రోజు గడవదు. నిత్యావసర వస్తువుల్లో నూనె పాత్ర చాలా ముఖ్యం. ప్రస్తుతం మార్కెట్లో వస్తున్న కల్తీ నూనెలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోపక్క నూనె ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో డిమాండ్‌కు తగ్గ లభ్యం కాకపోవడంతో కల్తీ నూనెను కొందరు వ్యాపారులు మార్కెట్లోకి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ బ్రాండ్ నూనె మంచిదో! ఏది కొంటే నాణ్యతతో ఉంటుందో తెలియక జనం సతమతమవుతున్నారు. ఇంట్లో తినడానికి నాణ్యతతో శుభ్రమైన, నమ్మకమైన సరకులనే ఉపయోగించాలన్న ఆసక్తి ఈ మధ్యకాలంలో ప్రజల్లో బాగా పాతుకుపోయింది. వంట నూనెల విషయంలో మరింత శ్రద్ధ వహిస్తున్నారు. ఈక్రమంలో విద్యావంతులు, చిన్న, పెద్ద, మధ్య తరగతి కుటుంబాలు తెల్ల కుసుమలు, పొద్దుతిరుగుడు గింజలు, పల్లీలు కొనుగోలు చేసి నూనె కోసం స్వయంగా గానుగ పట్టిస్తున్నారు. ఈమధ్య కాలంలో వీరి సంఖ్య పెరుగుతుండటంతో పల్లె ప్రాంత యువత గానుగ యంత్రాలను స్థానికంగా ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు.

రైతుల వద్ద కొనుగోలు

పంట ఉత్పత్తులు వచ్చే సమయంలో తెల్ల కుసుమలను రైతుల వద్ద ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్ ధర రూ.4,500, నుంచి 5,000 వరకు ఉంటుంది. ప్రజలు కుసుమలు ఎక్కడెక్కడ ఉన్నాయోనని ఆరా తీస్తూ స్వయంగా వెళ్లి కొంటున్నారు. సమీపంలో గానుగ మిల్లుకు తీసుకెళ్లి పట్టిస్తున్నారు. క్వింటాల్ తెల్ల కుసుమలకు నూనె 25 కిలోల వరకు వస్తుంది. బహిరంగ మార్కెట్లో మాత్రం లీటరు నూనె రూ.120కి విక్రయిస్తున్నారు. ఈక్రమంలో ప్రజలు శుభ్రమైన, కల్తీలేని నూనెలను ఇష్టపడుతున్నారు. గానుగ నూనెకు మంచి డిమాండ్ ఉన్నందున గానుగ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు వ్యాపారి ఎం.నర్సిరెడ్డి తెలిపారు.

ఉచితంగానే గానుగ పట్టిస్తా



కుసుమలు, పల్లీలు గానుగ పట్టించేందుకు డబ్బులు తీసుకోను. నూనె తయారు సమయంలో వచ్చే వేస్టేజీ(పిండి) మిగులుతుంది. నూనె ఫిల్టర్ చేయ లంటే మాత్రం కిలోకు రూ.2 తీసుకుంటా. నేను కూడా కుసుమలు కొనుగోలు చేసి గానుగ పట్టి లీటర్‌కు రూ.240 చొప్పున 5 లీటర్ల డబ్బాను రూ.1200లకు విక్రయిస్తా.

- ఎం.నర్సిరెడ్డి, గానుగ యంత్రం యజమాని

సెల్ టవర్లతో ప్రజల ఇక్కట్లు

● జనవాసాల మధ్య ఉండటంతో రేడియేషన్‌కు గురయ్యే అవకాశం.. స్థానికుల ఆందోళన
● పట్టించుకోని సంబంధిత అధికారులు

పరిగి, మే 14: పరిగి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జనవాసాల మధ్య సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటి ద్వారా వచ్చే రేడియేషన్‌తో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఆపై సెల్ టవర్ల యాజమాన్యాలు పురపాలక సంఘం, పంచాయతీలకు పన్నులు ఎగ్గొడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పరిగి పట్టణంలో పది చోట్ల వివిధ కంపెనీలకు చెందిన సెల్ టవర్లు ఉన్నాయి. అలాగే మండల పరిధిలోని సయ్యద్‌పల్లి, రాపోల్, మాదారం, నస్కల్, గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో వివిధ 30కి పైగా టవర్లు ఏర్పాటుచేసి సేవలందిస్తున్నారు. ఏ గ్రామంలో సెల్ టవర్ నిర్మించినా.. గ్రామ పంచాయతీకి రూ.10వేలు అనుమతి ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. అది పోను ప్రతీయేటా యజమానులు జీపీలకు పన్నులు చెల్లించిన దాఖలాలు కూడా లేవు. గతంలో పరిగిలోని 9వ వార్డు శివారులో నిర్మిస్తున్న టవర్ వద్ద స్థానికులు పలుమార్లు ఆందోళన చేసిన సంగతి విధితమే. టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో క్యాన్సర్ కారక రోగాలు వస్తాయని ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల మధ్య వాటిని నిర్మించకూడని కోరుతున్నారు. అధికారులు అనుమతిలిచ్చినా ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. ఇదిలా ఉండగా, గ్రామాల్లో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు అవగాహన లేకపోవడంతో పన్నులు వసూలు చేయడం లేదు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఇంటి పన్నులతో పాటు అధికారులు సెల్‌టవర్ నిర్వాహకుల నుంచి పన్నులు వసూలు చేస్తే గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. పన్నుల వసూలు సంగతి ఇలా ఉంటే ఇళ్లపై ఇష్టారాజ్యంగా టవర్ల నిర్మాణం చేపట్టడంతో ఈదురు గాలులు, భారీ వర్షాలకు ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు.



పరిగిలో ఇళ్లపై ఏర్పాటు చేసిన సెల్ టవర్లు

రేడియేషన్ ప్రభావంతో ఇబ్బందులు



ఇళ్ల మధ్య సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయడం వల్ల మనుషులపై రేడియేషన్ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గుండె, చర్మ సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇళ్ల మధ్య సెల్‌టవర్లు ఉండకపోవడమే మంచిది. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన టవర్లు, కంపెనీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.


- చిన్నయ్య, రిటైర్డ్ తహసీల్దార్, పరిగి

విభజనతోనే సరి.. వసతుల కల్పన ఏదీ మరి?

● పునర్విభజన అనంతరం అందుబాటులో లేని కార్యాలయాలు
● ఆమనగల్లులో ప్రతిపాదనలకే పరిమితమైన డివిజన్ కార్యాలయాల ఏర్పాటు
● నెరవేరని ప్రజాప్రతినిధుల, అధికారుల హామీలు

ఆమనగల్లు, మే 14: పాలనా సౌలభ్యం కొరకు 8ఏళ్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలను మహబూబ్ నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. నేటికీ అందుకనుగుణంగా వసతులు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారు. ఏళ్ల కాలంగా ప్రజలు కార్యాలయాలు అందుబాటులో లేక, దూరభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరరీ, ఆర్టీఏ, ఆర్డీవో, ఏసీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆర్అండ్‌బీ డీఈ, ఐబీ, డీఈ కార్యాలయాల ఏర్పాటు నేతల హామీలు, ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఆయా కార్యాలయాల ఏర్పాటు విషయంలో ఎవరు కూడా చొరవ చూపడం లేదన్న విమర్శలున్నాయి. డివిజన్ కార్యాలయాల ఏర్పాటు విషయంలో ప్రజాప్రతినిధుల, అధికారుల హామీలు కూడా నీటి మూటలుగానే మిగిలాయి. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన కడ్తాల మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో కలిపారు. అంతకుముందు మూడు మండలాల ప్రజలకు కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో కార్యాలయాలు అందుబాటులో ఉండి దూర, వ్యయ భారం ఉండేది కాదు. విభజన సమయంలో నాలుగు మండలాలకు కలిపి ఆయా కార్యాలయాలను ఆమనగల్లులో ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. 2016 అక్టోబరు 11న కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. అప్పట్లో సమస్యలను ముందుగానే గ్రహించిన ప్రజలు వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు అందుకు తగిన విధంగా ఆమనగల్లులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు పట్టణంలో కార్యాలయాల ఏర్పాటు వల్ల నాలుగు మండలాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోయింది. విభజన అనంతరం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మంలాలను కందుకూరు ఆర్డీవో పరిధిలో చేర్చారు. మాడ్గుల మండలాన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కిందికి మార్చారు. కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు సబ్‌ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, కార్యాలయాలు మహేశ్వరంలో, ఆర్టీఏ, ఏసీపీ కార్యాలయాలు షాద్‌నగర్‌లో కొనసాగుతున్నాయి. మిగతా కార్యాలయాలు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్నాయి. మాడ్గుల మండలం ప్రజలకు సైతం ఒక్కొక్క కార్యాలయాలు ఒక్కోచోట ఉన్నాయి. కల్వకుర్తి నియోజకవర్గం రెండు మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో, నాలుగు మండలాలు రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉండడంతో పాలనాపరంగా కూడా అనేక సమస్యలు తలెత్తున్నాయి. డివిజన్ కార్యాలయాల ఏర్పాటు కు బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు సైతం చేపట్టాయి. కొత్తగా ఏర్పాటైన కడ్తాల మండల కేంద్రంలో నేటికీ వసతులు ఏర్పాటు చేయలేదు.

ఏళ్ల కాలంగా ఇబ్బందులు



పాలనా సౌలభ్యం కోసం ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసిన ప్రభుత్వం వసతుల కల్పనలో విఫలమైంది. ఆమనగల్లు పట్టణంలో డివిజన్ కార్యాలయాల ఏర్పాటు గూర్చి ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి. 8 ఏళ్ల కాలంగా డివిజన్‌కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా స్పందన లేదు.

- శ్రీకాంత్‌సింగ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు, ఆమనగల్లు

ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం



ఆమనగల్లు పట్టణంలో డివిజన్ కార్యాలయాల ఏర్పాటు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డిల ద్వారా సీఎంను కలిసి డివిజన్ కార్యాలయాల ఏర్పాటు ఆవశ్యకత గురించి వివరిస్తాం. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యాలయాలు, వసతుల కల్పనలో విఫలమైంది.

- అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ సభ్యుడు, కడ్తాల్

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ అమానుషం

● ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

బొంరాస్‌పేట్, మే 14: నిబంధనల ప్రకారం టీఏ, డీఏలు చెల్లించాలని కోరిన ఉపాధ్యాయులపై పోలీసుల బలప్రయోగంతో లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల సంఘం జారీ చేసిన 691జీవో నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం హేయమైన చర్య అని అన్నారు. రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించడంతో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డితో పాటు ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాలతో పోలీసులు విచక్షణ రహితంగా లాఠీచార్జ్ చేయించడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



నందిగామ, మే 14: పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల పాలన పోయి అధికారుల పాలన రావడంతో నిర్లక్ష్యం తాండవిస్తోంది. నందిగామలో కొన్ని రోజులుగా పొద్దంతా వీధిలైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి. వాటిని బందుచేసే నాథుడు లేడు. అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడంలేదని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో అధికారుల గాడితప్పిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి సమస్యలపై దృష్టిసారించాలని, మంచిపాలన అందించాలని ప్రజలు కోరుతున్నారు.

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీదే



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్

తాండూరు, మే 14: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీదేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ అన్నారు. తాండూరులో మంగళవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షించిన అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీజేపీ అధిక మెజారిటీని సాధిస్తుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండు నెలలుగా చిత్తశుద్ధితో పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు బాలి శివకుమార్, గాజుల శాంతికుమార్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ఈటల గెలుపు ఖాయం

ఘట్‌కేసర్ రూరల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం ధీమా వ్యక్తంచేశారు. ఎదులాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్ గెలుపును ఎవరూ అపలేరని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీకి ఓటువేశారని గుర్తుచేశారు. ప్రజల గుండెల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని, మూడోసారి కూడా మోదీ ప్రధాని అవుతారని తెలిపారు. ఘట్‌కేసర్‌లో బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయని, అన్ని వర్గాల ప్రజలు ఈటలకే ఓటువేశారని తెలిపారు. ఈటల రాజేందర్ గెలుపునకు నిరంతరం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేశారని తెలిపారు. బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, ఈటలకు ఓటువేసిన మండల ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. బీజేపీపై ఉన్న నమ్మకంతో ప్రజలు ఈటల రాజేందర్‌కు స్వచ్ఛందంగా ఓటు వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గ్యార చిరంజీవి పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు, రాచకట్ల శ్రీశైలం

రోడ్డుపై ధాన్యం ఆరబోత.. పొంచి ఉన్న ప్రమాదం

● చోద్యం చూస్తున్న అధికారులు



సంగెం-వేములనర్వ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్ప

కేశంపేట మే 14: రోడ్లపై ప్రమాదం పొంచి ఉంది. ధాన్యం కుప్పలతో వాహనదారులు పడిపోయే ఆస్కారం ఉంది. రైతులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ధాన్యాన్ని ఆరబోస్తూ రాత్రి వేళ కుప్పగా చేస్తుండడంతో కుప్పలు గమనించిక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. మండల పరిధి సంగెం-వేముల్‌నర్వ గ్రామాల మధ్య ఇటీవల డబుల్ రోడ్డు వేశారు. సీసీ రోడ్డు నున్నగా ఉండడంతో రోడ్డును రైతులు పంటల నూర్పిళ్లకు ఉపయో గించుకుంటున్నారు. ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ధాన్యం కుప్పలపై కప్పే నల్లటి తాటిపత్రి రాత్రి వేళల్లో కన్పించక వాహన దారులు ప్రమాదాలకు గరయ్యే ఆస్కారం లేకపోలేదు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడే అవకా శాలున్నాయి. రోడ్లపైన ధాన్యం ఆరబేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకోవాలి



రోడ్లపై ధాన్యం ఆరబోయకుం డా అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో రోడ్లపై ధాన్యం కుప్పలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు కల్లాల్లోనే వడ్లు ఎండబోసుకోవాలి.

\- సురేష్ డ్రైవర్ కొత్తపేట



క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం.. వ్యక్తి ఆత్మహత్య

పెద్దేముల్, మే 14: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన ఎంద్రకాయల జగన్(30) కుటుంబ సభ్యులకు పాత ఇల్లు ఉంది. దాన్ని కూల్చివేసి అతడి అన్నదమ్ములు వారికి వచ్చిన స్థలంలో ఇళ్లు ఉట్టుకున్నారు. జగన్ ఇల్లు కట్టుకునేందుకు వారు స్థలం విడిచిపెట్టారు. అయితే ఇల్లు కట్టుకోవడానికి తనవద్ద డబ్బులులేవని మదనపడేవాడు. తన భార్యతో ఇదే విషయమై పలుమార్లు చెప్పుకుని బాధపడేవాడు. సోమవారం రాత్రి తన అన్నతో ఇల్లుకట్టుకునే విషయమై మాట్లాడి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఎక్కడ వెతికినా అతడు కనిపించలేదు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా తనపొలంలోని చింతచెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతుడి భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మౌనిక ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గిరి తెలిపారు.

రైలుకింద పడి యువతి..



రైలు పట్టాలపై శ్రావణి మృతదేహం

వికారాబాద్, మే 14: రైలుకింద పడి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ సమీపంలో మంగళవారం రాత్రి వికారాబాద్ నుంచి షిర్డీ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి శ్రావణి(17) ఆత్మహత్య చేసుకుంది. దీంతో యువతి తల తెగి పడిపోగా పట్టాలమధ్యలో యువతి శరీరం పడి ఉంది. ఇది గమనించిన రైలు లోకోపైలెట్ వికారాబాద్ స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. స్టేషన్ మేనేజర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట అనుబంధ గ్రామమైన బాబూపూర్‌కు చెందిన యువతిగా గుర్తించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గున్‌గల్‌లో వ్యక్తి..

యాచారం, మే 14: మండలంలోని పరిధిలోని గున్‌గల్ గ్రామంలో మం గళవారం రాత్రి ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గున్‌గల్‌కు చెందిన ముత్యాల రాజేష్(44), మాధురి దంపతులు. వీరు కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొంత కాలంగా బాధపడుతున్నారు. దాంతో రాజేష ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి లతిక, తాప్సి అనే కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

జుంటుపల్లి రామస్వామి ఆలయంలో చోరీ

● వెండి కిరీటం, నగదు అపహరణ



జుంటుపల్లి రామస్వామి దేవాలయంలో దుండగులు పగులగొట్టిన హుండీ

యాలాల, మే 14: మండలంలోని జుంటుపల్లి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయ ధర్మకర్త హనుమంతరావు దేశ్‌ముఖ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం చివరి పూజ ముగిసిన తర్వాత ఆలయానికి తాళాలు వేసి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు విరగొట్టి ఆంజనేయ స్వామి వెండి కిరీటాన్ని అపహరించారు. అనంతరం ఆలయం ఆవరణలో ఉన్న హుండీని పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం గుడి దగ్గరికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన అండాలు

కడ్తాల్, మే 14: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన కడ్తాలలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... కడ్తాలకు చెందిన కోషిక అండాలు(40) మంగళవారం ఉదయం ఇంటి ముందు చెత్త పారబోసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు చెయ్యి తగిలి అండాలు అక్కడికక్కడే మృతిచెందింది. అండాలుకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అండాలు కుమారుడు సంజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

మహిళల ఓట్లే అధికంగా నమోదు



తాండూరు: అంతారంలో క్యూలైన్‌లో బారులుతీరిన మహిళా ఓటర్లు(ఫైల్)

తాండూరు, మే 14: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గం యందు పార్లమెంటు ఎన్నికలలో మహిళ ఓటర్లే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2లక్షల 43వేల 192 మంది ఓటర్లుండగా లక్షా 63వేల 759 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 81317 మంది పురుషులు, 82439 మంది మహిళలు, ముగ్గురు టాన్స్‌జెండర్స్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1122మంది మహిళలు పురుషుల కంటే ఎక్కువగా ఓటు హక్కును పొందారు. పెద్దేముల్ మండలంలో 39906 మంది ఓటర్లుండగా 30135మంది ఓటర్లు ఓటు వేయగా అందులో 14976మంది పురుషులు, 15159మంది మహిళలు, కోట్‌పల్లి మండలంలో 6121 మంది ఓటర్లుండగా 4524 మంది ఓట్లు ఓటు వేయగా 2271 మంది పురుషులు, 2253 మంది మహిళలు ఓటు వేశారు. యాలాల మండలంలో 40483 మంది ఓటర్లుండగా 29352 మంది ఓటరు హక్కు వినియోగించుకున్నారు. వారిలో 14363 మంది పురుషులు, 14989 మంది మహిళలు ఓటు వేశారు. బషీరాబాద్‌లో 40235 మంది ఓటర్లుండగా 27062మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక టాన్స్‌జెండర్, 13,353 మంది పురుషులు, 13708మంది మహిళలు ఓటు వేశారు. తాండూరు మున్సిపాలిటీ తాండూరు మండలం కలిపి 1,16,447 మంది ఓటర్లు ఉండగా 72,686 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 36354 మంది పురుషులు, 36330 మంది మహిళలు, ఇద్దరు టాన్స్‌జెండర్స్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలల్లో మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాండూరు సెగ్మెంట్‌లో అత్యధికంగా పోలింగ్ కేంద్రం 24ఎ నందు 91.86 శాతం నమోదవగా, అత్యల్పంగా పోలింగ్ కేంద్రం 80లో 29.37 శాతంతో తక్కువగా పోల్ అయ్యింది.

బషీరాబాద్‌లో 67.13శాతం పోలింగ్

బషీరాబాద్: మండలంలో 36గ్రామ పంచాయతీలకు గానూ 39,914 మంది ఓటర్లు ఉండగా పార్లమెంట్ ఎన్నికల్లో 26,793మంది తమ ఓటును వినియోగించుకున్నట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 47 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 67.13 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయన వివరించారు. ఆయా గ్రామపంచాయతీల్లో బూత్‌ల వారీగా ఓటింగ్ నమోదు వివరాలు ఇలా ఉన్నాయి. కాశీంపూర్ పరిధిలో 1332 ఓటర్లు ఉండగా 1015, బద్లాపూర్‌లో 768 ఓటర్లకు 639, కుప్పన్‌కోట్‌లో 500 ఓటర్లకు గాను 424, గొట్టిగఖుర్దులో 750 ఓటర్లకు 592, గొట్టిగకలాన్‌లో 698 ఓటర్లకు 538, నవాల్గ పరిధిలో 3635 మంది ఓటర్లకు గాను 2,327, పర్వత్‌పల్లిలో 1079 మంది ఓటర్లకు గాను 772, మర్పల్లిలో 574 ఓటర్లకు 435, నీళ్లపల్లిలో 821 మంది ఓటర్లు ఉండగా 621 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జలాల్‌పూర్‌లో 1087 మంది ఓటర్లకు 754, మైల్వార్‌లో 2616 ఓట్లు ఉండగా 1779, కంసాన్‌పల్లి(ఎం)లో 752 ఓట్లకు 530, ఎక్మాయిలో 2582 ఓటర్లకు 1724, దామర్‌చెడ్‌లో 2859 ఓటర్లకు 1761, అల్లాపూర్‌లో 598 ఓట్లు ఉండగా 486, మంతన్‌గౌడ్ తండాలో 1308 ఓట్లు ఉండగా 806, ఇందర్‌చెడ్‌లో 651 ఓటర్లకు 490, బషీరాబాద్‌లో 5683 మంది ఓటర్లు ఉండగా 3135 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. నవాంద్గీలో 872 మంది ఓటర్లు ఉండగా 684, మాసన్‌పల్లిలో 713 మంది ఓటర్లకు 537, కొర్విచెడ్‌లో 877 మంది ఓటర్లకు 630, కొర్విచెడ్‌ఘనిలో 995 మంది ఓటర్లు ఉండగా 560, క్యాద్గీరాలో 862 మంది ఓటర్లకు 520, గంగ్వార్‌లో 383 మంది ఓటర్లకు 313, జీవన్గిలో 2706 ఓటర్లకు గాను 2182, మంతట్టిలో 1629 ఓటర్లకు గాను 1052, రెడ్డిఘణాపూర్‌లో 1278 మంది ఓటర్లకు 851, కంసాన్‌పల్లి(ఎం)లో 367మంది ఓటర్లకు 267మంది ఓటు వేశారు.

అసెంబ్లీకి 76.70 శాతం.. లోక్‌సభకు 65.18 శాతం

పరిగి: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పూర్తిగా తగ్గింది. గత ఐదునెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో 11.52శాతం పోలింగ్ తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి సెగ్మెంట్ పరిధిలో 76.70శాతం పోలైంది. లోక్‌సభకు 65.18శాతం పోలింగ్ జరిగింది. ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం ఎన్ని చైతన్య కార్యక్రమాలు పోలింగ్ శాతం తగ్గడం గమనార్హం.

ఘట్‌కేసర్ మండలంలో 64.79 శాతం ఓటింగ్

ఘట్‌కేసర్ రూరల్: సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 11గ్రామాల్లో 64.79శాతం ఓట్లు నమోదయ్యాయి. మండలంలో మొత్తం 41,952 ఓటర్లు ఉండగా 37 పోలింగ్ బూత్‌లలో 27,181 ఓట్లు పోలయ్యాయి. అవుషాపూర్‌లో 4,205కు గానూ 2800, అంకుశాపూర్‌లో 2,852 ఓటర్లకు గానూ 1,915, ఎదులాబాద్‌లో 5,844ఓట్లకు గాను 4,200, మర్రిపల్లిగూడలో 1,011కు గానూ 802, మాదారంలో 302కు గానూ 265, ఘనాపూర్‌లో 1,764కు గానూ 1,347, కొర్రెములలో 5,236కు గానూ 3,169, వెంకటాపూర్‌లో 1,643కు గానూ 1,180, చౌదరిగూడలో 11,199కు గానూ 6,043, ప్రతాప్‌సింగారంలో 2,400కు గానూ 1,791, కాచవానిసింగారంలో 5,034కు గానూ 3,663 ఓట్లు నమోదయ్యాయి. మండలంలో 27,181 మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఇంకా 14,771మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అధికారులు ఓటు హక్కుపై ఎంత అవగాహన కల్పించినా కొంతమంది ఓటర్లు మాత్రం ఓటు హక్కును వినియోగించుకోలేదు.

ధారూరులో 75.43 శాతం..

ధారూరు: మండలంలో సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో ఓటింగ్ శాతం పెరిగింది. మండలంలోని 47 బూత్‌ల్లో 75.43 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లు 35,583 కాగా వారిలో 26,848మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 10,754 మంది పురుషులు, 8,302 మంది మహిళా ఓటర్లు తమ ఓటు వేశారు.

ఘనంగా భగీరథుడి జయంతి



పరిగిలో భగీరథుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, మే 14: పరిగిలో భగీరథ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పరి రవిసాగర ఆధ్వర్యంలో పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో భగీరతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పరి రవిసాగర మాట్లాడుతూ.. భగీరథులు చాలా గొప్ప మహనీయుడని, ఆయన ఆశయసాధనకు ప్రతీజ్ఞరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, శ్రీనివాస్, రాఖి, మారుతి, కార్తీక్, గౌతమ్ అనినాష్, నర్సింహులు, చెన్ను దాసు, శివకుమార్, రాజు, సతీష్, నాగేశ్, మహేందర్, తేజలు పాల్గొన్నారు. అదేవిధంగా పరిగి మండలం రాపోల్‌లో భగీరథుడి జయంతి నిర్వహించారు.

చౌదరిగూడ: కఠోర తపస్సుతో గంగను దివి నుంచి భువికి తెచ్చిన భగీరథుడు అందరివాడని సగర సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడలోని భవన ని ర్మాణ సంఘం కార్యాలయంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పద్మయ్య, వెంకటేష్, శ్రీను, బాలు, శ్రీరాములు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

మర్పల్లి, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయడంతో కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై ఎన్నికలబరిలో నిలిచారని ఆరోపించారు. ఎవరెన్ని ప్రలోభాలకు గురిచేసినా కాంగ్రెస్ రంజిత్‌రెడ్డి గెలుపును ఆపలేరని ధీమావ్యక్తం చేశారు.

చించల్‌పేటలో నేటి నుంచి ఉర్సు

నవాబుపేట, మే 14: మండలంలోని చించల్‌పేట గ్రామంలో బుధవారం నుంచి హజరత్ మొహ్మద్‌షా ఖాద్రీ ఉలిచిస్తియా షరీఫ్ 72వ ఉర్సును పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న గంధోత్సవం, 16న దీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉర్సు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరుకానున్నట్లు తెలిపారు.

రోడ్డుపై గొయ్యి మూయించిన అధికారులు



రోడ్డుపై భారీ గోతిని సీసీతో మూయించారిలా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తూర్, మే 14: మండల పరిధిలోని తిమ్మాపూర్-మల్లాపూర్ రోడ్డులోని తాళ్లగూడ సమీపంలో గల కల్వర్టు వద్ద ఏర్పడిన భారీ గోతిని అధికారులు మూయించారు. నడి రోడ్డుపై గోతి పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. తరుచూ ప్రమాదాలతో బెంబేలెత్తిపోయారు. సమస్యను గుర్తించి ఈ నెల 9న ఆంధ్రజ్యోతిలో 'నడి రోడ్డుపై భారీ గొయ్యి.. పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ప్రచురితమైన వార్తకు సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. రోడ్డు పైపడిన గోతిని సీసీ వేసి మూయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి

కందుకూరు, మే 14: సాయిరెడ్డిగూడకు చెందిన వార్డు మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుమ్మలూరు జంగయ్య(40) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. జంగయ్య కుటుంబ సభ్యులను పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి ఓదార్చి, మృతదేహానికి నివాళ్లు అర్పించారు. జంగారెడ్డి మాట్లాడారు. జంగయ్య మృతికాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, ఆయన పార్టీకి, ప్రజలకు చేసిన సేవలను గొప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు బుక్క మహేష్, జి.రమేష్, బొర్ర రాములు, వినోద్‌చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



కొడంగల్ రూరల్: ఆర్థిక సాయం అందజేస్తున్న నరేశ్‌సాగర్, శైలజ దంపతులు



దోమ: అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్, మే 14: మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన నరేశ్‌సాగర్, శైలజ దంపతులు మంగళవారం తమ కుమారుడి వర్ధంతి సందర్భంగా అదే గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన మహిళా కుమారుడు తుల్జనాయక్‌కు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలే తుల్జనాయక్ తల్లి మాణిక్‌బాయి మృతి చెందడంతో ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుల్జప్ప, కమలమ్మ, వెంకటయ్య, నర్సింహులు, ప్రకాశ్, నాగేందర్, మల్లేశ్, మహేశ్, హరికృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన ముద్దం శ్రీనివాస్, గాజుల చోటు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మంగళవారం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేశ్, అంతిరెడ్డి, చంద్రశేఖర్, రాము, మల్లారెడ్డి, కలీమ్, బాల్‌రాజ్, భాస్కర్, రమేశ్, బషీర్, ప్రభాకర్, హన్మయ్య, హైమద్, మహేశ్, యాదయ్య, కె.నర్సింహులు, వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్య మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి స్వామి స్పందించారు. అంత్యక్రియల నిమిత్తం తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.



కులకచర్ల: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుక్కదాడిలో మృతిచెందిన పసికందు కుటుంబానికి ఆర్థిక సాయం



పసికందు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఆర్పీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: కుక్క దాడిలో మృతిచెందిన పసికందు తల్లిదండ్రులకు తాండూరు కాంగ్రెస్ నాయకులు, ఆర్పీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణ శివారులోని బసవేశ్వర కాలనీలో కుక్కదాడిలో ఐదు నెలల బాలుడు సాయినాథ్ మృతదేహాన్ని తాండూరులోని జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి కుటుంబీకులను జిల్లా ఆసుపత్రికి చేరుకుని బాలుడి తల్లిదండ్రులను పరామర్శించారు. వారికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుక్క దాడిలో బాలుడు మృతిచెందడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని ఆయన పోలీసులు, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు జోషి వికాస్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.